## సింగిల్ పేజీ కథలు

# గుణపాఠం

ధర్మారావ్‌కి మాధవితో ఈమధ్యనే పెళ్లి జరిగింది. పెళ్ళంటూ జరిగాక ఇద్దరు మనుషులంటూ ఏకం కావలసిందే. మనుషులంటూ ఏకం అయ్యాక మనసులు, ఆనక చిన్ని చిన్ని గొడవలు, అందమైన అలకలు మామూలే.

మరి ధర్మారావ్ మీద మాధవి మొదటి అలక ఎలా మొదలయ్యిందంటే...

ఆఫీస్ పని ముగించుకుని ధర్మారావ్ ఆరు గంటలకి ఇంటికొచ్చాడు. ఓరోజు పకోడీలు, ఇంకోరోజు మిర్చీలు వేడి ప్లేటులో అందించే మాధవి ఆరోజు ఏం అందించలేదు.

అసలు బెడ్‌రూమ్‌లోంచే బయటికి రాలేదు. కారణం కనుక్కుందామని లోనికి వెళ్ళాడు. ప్రేమగా "ఏం జరిగిందోయ్!" అన్నాడు.

ఆమె మరో రెండు మార్లు అలాగే బ్రతిమాలనిచ్చి అప్పుడు పెదవి కదిపింది.

"నా భర్తది నాలుగంకెల జీతం అయ్యుండీ ఇంట్లో బ్లాకండ్ వైట్ టీవీ వుందని చెప్పుకోవటానికి సిగ్గుగా వుంది" అంది.

ధర్మారావ్ ఆలోచనలో పడ్డాడు.

"నా ఉద్దేశం అది కాదు మాధవీ! కలర్ టీవీ కొనడం అంటే కళ్ళ జబ్బులు కొనడం అన్నమాటే"

"మీరు పత్రికల్ని ఫాలో అవుతారని తెలుసు. అయినా డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లో నగం మందులు వాడి జబ్బు నయం అయిందనిపించుకునే వాళ్ళు ఎంతో మందున్నారు తెలుసా" సాక్ష్యంలాంటి ఓ నిజం చెప్పేసింది.

ధర్మారావ్ ఇంకోలా నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు.

మాధవి ఊరుకోకుండా అప్పటివరకు ఫాలో అవుతున్న సీరియళ్ళ స్టోరీలన్నీ విప్పింది. బ్లాకండ్ వైట్‌లో వివిధ డబ్బింగ్ సీరియల్ వాళ్ళ చీరల డిజైనింగ్, మేకప్ కలర్స్ పోల్చుకోటం కష్టంగా వుందని తేల్చింది.

ధర్మారావ్‌కి మరి కొనక తప్పలేదు.

తీరా కొన్నాక కొత్త బాధలు ఎలా తలెత్తాయంటే?

'నవగ్రహాలు' సీరియల్‌లో మూడు వందల నలభై రెండో ఎపిసోడ్. హీరోయిన్ రాకకోసం ఎంతోమంది ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సీన్ అది.

మాధవి కూడా ఎదురు చూడసాగింది. తీరా హీరోయిన్ని చూశాక షాక్!

ఆమె వేసుకొచ్చిన మానుకాయరంగు పువ్వుల శారీ సూపర్బ్! ఫెంటాస్టిక్!


ఏ పెళ్ళికయినా, ఫంక్షన్స్‌కయినా వెళ్ళటానికి సరిగ్గా అలాంటి చీరే కడితే? తనూ ఆ హీరోయిన్‌కి ఏమాత్రం తీసిపోదు అన్న ఆలోచన కలిగింది.

అంతే- వెంటనే మళ్ళీ అలకేసింది.

ఆఫీసు నుంచొచ్చిన ధర్మారావ్‌కి ఆరోజూ వేడి పకోడీ ప్లేట్ అందలేదు. బెడ్‌రూమ్‌లోనించి బయటికే రాలేదు. లోపలికెళ్ళి చూపుడు వేలితో చిన్నిగెడ్డం ఎత్తాడు. కోరిక చెప్పింది. అచ్చం అదే శారీ అన్ని షాపులు వెతికైనా సరే కొనాలంది.

ధర్మారావ్‌కి తప్పలేదు.

ఆ తర్వాత మరో మెగా సీరియల్‌లో ఓ అత్త పాత్ర చేసు



కున్న మేకప్ నచ్చింది. ఈసారి ధర్మారావ్‌కి మేకప్ కిట్‌కి టెండర్ తప్పలేదు.

ఇంకో మెగా సీరియల్‌లో జ్యువెలరీ. ఈవిధంగా మాధవి కోరికలు గుర్రాలైనాయ్.

ధర్మారావ్ అప్పులపాలయ్యాడు.

'ఫ్చ్! లాభం లేదు. తన సతీమణి టీవీ కోరికలకి ఏదో ఒక కళ్ళెం వేయాలి' అనే నిర్ణయానికొచ్చాడు. కానీ ఎలా?

* * *

"రండి! రండి మామగారూ! నేనే మీకో ఉత్తరం ముక్క రాయటమో, టెలిఫోనో చేద్దామనుకుంటున్నాను" ఆ ఉదయం చేతినిండా బరువుతో ప్రత్యక్షమైన మాధవి తండ్రి వెంకటాచలాన్ని చూస్తూ అన్నాడు ధర్మారావ్.

"అలాగా..ఏం!" అన్నాడతను సందేహంగా.

"ఇంతర్జెంటుగా చెప్పాల్సిందేం లేదు లెండి. సాయంత్రం తీరుబడిగా మీకే తెలిసొచ్చేట్టు చేస్తా" అన్నాడు.

అనంతరం కుశలప్రశ్నలవీ వేసుకున్నారు.

ఆ తర్వాత ధర్మారావ్ యథాప్రకారం ఆఫీస్‌కి బయల్దేరి సాయంత్రం వచ్చాడు.

ఆనక ఇద్దరూ చాప పరుచుకుని కూర్చున్నారు. పెళ్ళయిన కొత్తల్లో అత్తగారింట్లో వున్నప్పుడు కాలం గడవక మాటమాటా కలిసి పేకాటకి దిగారు. అప్పట్నించి ఇద్దరూ కలిసినప్పుడల్లా ఓ రౌండయినా వెయ్యటం అలవాటుగా మారింది.

"మనం అక్కడ సీక్వెన్స్ అనే పదం ఉపయోగిస్తాము..దాన్నే హైదరాబాదులో రమ్మీ అంటుంటారు" అన్నాడు ధర్మారావ్ ఏదో ఒకటి మాట్లాడాలని.

"అవునా" అని, "ఊరికే ఆడితే అంత థ్రిల్ అన్పించదు. ఏదైనా చిరు పందెం వేద్దామా" అన్నాడు వెంకటాచలం తమాషాగా.

"ఓ..యస్..ఏం వేద్దాం" అడిగాడు ధర్మారావ్.

"ఎంతైనా మీరు అల్లుడు పోస్ట్ కాబట్టి చెప్పటం కంటే చేసి చూపటం నా బాధ్యత. నేనొకటి మనసులో అనుకుంటాను. ఓడిపోతే అదేంటో చెప్పి మీకు వెంటనే అందేలా చేస్తాను"

"అయితే నరే నేనూ అంతే.."

ఒప్పందం కుదిరింది. మొదటి రౌండ్‌లో సదరు వెంకటాచలంగారే ఓడిపోయారు. మామగారు తనకేం ఇవ్వాలనుకున్నారోనని ఆత్రంగా ఎదురుచూశాడు ధర్మారావ్.

ఈలోగా మాధవి వచ్చి ఇద్దరికీ టీ ఇచ్చి తిరిగి టీవీ దగ్గరికెళ్ళింది.

"అల్లుడుగారూ! మొత్తం మీద నా దగ్గర్నుంచి ఓ స్కూటర్ అందుకోబోతున్నారు! అదే నేను మనసులో అనుకున్నది"

మామగారు మాటన్నారంటే ఆరునూరయినా జరుగుతుందని ధర్మారావ్‌కి తెలుసు. ఎక్కడలేని సంతోషంతో 'థాంక్స్' చెప్పాడు. ఈసారి రౌండ్ మొదలయింది. ఆద్యంతం ఉత్కంఠంగా సాగింది. ముందు ఓడిపోయినందుకు వెంకటాచలం ముక్కలు ఆపి మొత్తానికి కసిగా ఆడాడు. ధర్మారావ్‌కి ఓటమి తప్పలేదు.

అల్లుడుగారు తన పందెంలో ఏం కాశారోనని ఆసక్తిగా ముందుకు వంగాడు వెంకటాచలం. "సారీ మామగారూ! జూదంలో భార్యల్ని పణంగా పెట్టటం బహుశా నాకు పేరు వారసత్వం అయ్యుంటుంది. మీ అమ్మాయి టీవీ పిచ్చి నుంచి బయటపడేవరకూ పుట్టింటి వాసం తప్పదుగాక తప్పదు" చెప్పేశాడు.

అల్లుడి నిర్ణయం విని హతాశుడైపోయాడు వెంకటాచలం.

**-పావులూరి శివాజీ** (తుర్లపాడు)